కవితా కౌముది

# రాయి నీడ

డా.సి.భవానీ దేవి

ఆ తోటలో రోజా ఇన్నిసార్లు
పచార్లు చేస్తుంటానుకదా ..
ఆ నల్లరాయినేందుకో గుర్తించనేలేదు!
కానీ ఎప్పుడో ఒక సుప్రభాతంలో
సూర్యతేజస్సు వక్రీభవనమై
యథాలాపంగా సాగుతున్న పాదాల మీద
దాని నలుపునీడను పులిమినప్పుడు,
పక్కనున్న మందారపూల చెట్టు
గాలి లయగతులతో సయ్యాటలాడింది !
నా కాళ్ళకంటుకున్న నీడ జిలుగుస్మృతి
తోటకంతా ప్రాణదీపమైంది !
అది ఒక్కోసారి నా వెనకే వస్తుంటుంది,
ఆ స్పర్శ అంటుతున్నా వెనక్కి తిరిగి చూడను!
ఇంతలో ఒక బాదంఆకు నిశ్శబ్దంగా
ఆ రాయిమీద రాలిన చప్పుడులో
దాని విషాదహాస్యం చెవిలో రహస్యంగా...
ఆ గాయం నన్ను నిలువెల్లా తాకుతుంది
అయినా నేను వెనక్కితిరిగి చూడలేను
తలతిప్పితే కల కరిగిపోతుందేమోనని...!
రాయి నీడను మోసుకుంటూ
ముందుకే నడుస్తుంటాను
మున్ముందుకే అడుగులేస్తాను.!!

★★★★

## ఎవరికి తెలుసు?
### శ్రీ సాహితి

చేతులకు చెప్పులు లేకుండా
ఎర్రని కాగితంపై మరిగే సిరాతో
చెమటలు కక్కుతూ
మంటక్కిన ఆలోచనలతో
నెత్తిన గుడ్డ ముక్క లేకుండా
అలసటను భరిస్తూ
వడివడిగా దుమికే
నా కలం అడుగులో
అర్థం ఎవరికి తెలుసు?

ఎరుపెక్కిన అనుభవం
మదమెక్కిన ప్రశ్నను  డీ కొని
బలంకొద్దీ బుద్దిని కూడగట్టి
ఆవేదన ఆవిరిగా సుడులు తిరిగి
మేఘమై గర్జిస్తూ
వర్షంతో వణికిస్తు
పొడిబారిన మట్టి తలను నిమిరి
వడబారిన వృక్షాలు ఒళ్ళు తడిమి
నా కలం చేతుల్లో
ఆవేశపు ఆలొచన ఎవరికి తెలుసు?

★★★

## రవిదొరవారు చలిదొంగగారు
### రవి కిశోర్ పెంట్రాల

శిశిరంలో చలిపులి గజదొంగగారు
నిత్యంతనువంతా తీవ్రంగా తడిమేస్తూ
సిరిసంపదలేం దోచుకోబోయారో
దౌర్జన్యాల దాష్టికాలేంజేయబోయారో!

ఆడంబరంగా అగుపించే ఆస్తుల్ని
సర్వంగోల్పోయామని రాల్చుకొనిజూపిస్తూ
ఓడుబోడులమని అరకానీకి గొరగామని
తుషారబ్బట్టలు పొగమంచు దుప్పట్లప్పు దెచ్చుకుని!

వాసంతానేం తెలియని ధైర్యమో తరులకి
భద్రంగా బోషాణంలో దాచిన నగానట్రలు
రంగురంగుల సొగసైన చీనాంబరాలు
ఒక్కొక్కటిగా తీసిపట్టుకొచ్చి పెట్టుకున్నట్టు!

కొమ్మకొమ్మకి చిక్కటి చిగుర్ల పట్టువస్త్రాలు
జొకాల్లా తరుశాఖలకి వ్రేలాడ్తూ లేకాయలు
వివాహానికి నవవధువు ముస్తాబవుతూ
వజ్రవైడూర్యాలు కెంపుపచ్చల్దలంచినట్టు!

అద్భుతహొయల విరులమేయ సౌందర్యసిరులు
మధుమాసపురేడు సూరీడ్ని జూసుకొనేమో
రవిదొర చలిదొంగని బందీజేశాడేమోనంటూ
వాసంతసొబగులు వేనోళ్ళ పొగుడుతూ కోయిలలు!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఆత్మ తనువును వీడుటకర్థమేమి?
కదలిపోయెడునాత్మకు గమ్యమేమి?
గమ్యమున్నదో క్షణములో కరగిపోయి
తనువువలె యదృశ్యమగునొ తాను గూడ

ఏల మనుజులు బ్రతుకు చాలింపవలెను?
ఎవ్వరీ మార్గమును నిర్ణయించిరెపుడు?
చిరము జీవింతుమా మన చేతనున్న?
అలసి చాలని వాంఛింతుమా సుషుప్తి?

ఇమ్మహీతలమున మరణమ్ము కంటె
నిశ్చయమ్మేది కానంగనేరమెపుడు
తథ్యముగనొనగూడునస్తమయయాత్ర
కేమి యుపయోగమున్నదో యెవ్వడెరుగు?

పగలు జీవితగతి, విశ్రమగతి రాత్రి
దినము తిరుగాడి రాత్రి నిద్రించినట్లు
బ్రతుకు సాగించి మృత్యుమార్గమ్ము పట్టి
విశ్రమింతుము మరల జీవితమునొంద

చేయవలసినవన్నియు చేయువెనుక
పొందవలసినవన్నియు పొందువెనుక
భాగ్యమో లేమియో యదె యోగ్యమౌను
ఇంక నడువగవలయును గృహమువైపు

COMMENTS